సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం : 20 : సెప్టెంబర్ : 2024



రైతులకు పెద్దపీట

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

- 9లో



అభ్యంతరాలు తెలపాలి

పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓలు సూచించారు.

- 9లో



రాంగ్ రూట్!

ఎన్‌హెచ్–163పై యూటర్న్‌లు దూరంగా ఉండడంతో వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

- 10లో

సమీక్షతోనే సరిపెట్టారు!

మూసీ కాలువలు, గంధమల్ల కోసం నిధుల విడుదలకు నీటిపారుదల శాఖ మంత్రి హామీ

- 20 రోజులు గడిచినా ఆ ప్రస్తావనే లేదు
- సాగునీటి ప్రాజెక్టులపై నేడు చందంపేటలో భట్టి, ఉత్తమ్‌ల సమీక్ష
- నిధుల విషయాన్ని మరోసారి గుర్తు చేయనున్న జిల్లా ఎమ్మెల్యేలు




ఆనవాళ్లు కోల్పోయిన బునాదిగాని కాలువ

సాక్షి యాదాద్రి : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మూసీ కాల్వల ఆధునీకరణతో పాటు గంధమల్ల రిజర్వాయర్ పనుల్లో కదలిక వస్తుందని రైతులు, స్థానికులు భావించినా నిరీక్షణ తప్పేలా లేదు. జిల్లా ప్రజలకు జీవనాడిగా నిలిచే ఈ ప్రాజెక్టులకు తక్షణం నిధులు విడుదల చేస్తామని గత నెల భువనగిరిలో జరిగిన సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. కానీ, 20 రోజులు గడిచినా నిధుల ప్రస్తావనే తేవడం లేదు. ఎస్ఎల్‌బీసీపై సమీక్షించేందుకు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నల్లగొండ జిల్లా డిండికి రానున్నారు. ఈ నేపథ్యంలో నిధుల విషయాన్ని మరోసారి గుర్తు చేసేందుకు భువనగిరి జిల్లా ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు.

నాలుగేళ్ల క్రితమే నిలిచిన మూసీ కాలువలు

యాదాద్రి జిల్లా రైతులకు ప్రధాన సాగునీటి వనరులైన బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల ఆధునీకరణ పనులను ఏడేళ్ల క్రితం చేపట్టారు. నిధుల కొరతతో నాలుగేళ్ల క్రితం పనులు నిలిచిపోయాయి. తాజా అంచనాల ప్రకారం పిల్లాయపల్లికి రూ.88.22 కోట్లు, బునాదిగాని కాల్వకు రూ.269 కోట్లు, ధర్మారెడ్డి కాలువకు రూ.98 కోట్లు అవసరం అవుతాయని నీటిపారుదల శాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ మూడు కాలువలకు వెంటనే నిధులు విడుదల చేస్తామని భువనగిరిలో జరిగిన సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. కానీ, ముఖ్య మంత్రి కార్యాలయం, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఫైళ్లు నిలిచిపోయాయి. ఈ రెండు చోట్ల ఫైళ్లు కదిలితే తప్పా.. నిధులు విడుదలయ్యే అవకాశాలు లేవు.



నిధులొస్తేనే 'గంధమల్ల'కు మోక్షం

ఆలేరు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందించాలన్న ఉద్దేశంతో తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువును రిజర్వాయర్ చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. 1.41 టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.575 కోట్లు మంజూరు చేసింది. అయితే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో నిధుల విడుదలకు మోక్షం కలగడం లేదు. దీంతో రిజర్వాయర్ పనులకు టెండర్లు పిలవాలని అధికారులు భావించినా వెనుకడుగు వేస్తున్నారు.

మరోసారి గుర్తు చేస్తా



మూసీ కాల్వల ఆధునీకరణకు ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసినప్పటికీ ఇంకా విడుదల చేయలేదు. బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు రూ.250 కోట్లు కావాలి. వీటితో పాటు మూసీ ఆధారిత కాలువలు జూలూరు, బొల్లేపల్లి, బీమలింగం కాలువల మరమ్మతుల కోసం నిధులు అవసరం ఉన్నాయి. నిధులు కావాలని ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరాం. మరోసారి డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్‌కు గుర్తు చేస్తా.

-కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

నిధులు విడుదల చేయాలని కోరుతా



ఆలేరు నియోజకవర్గానికి తలాపున ఉన్న తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలకోసం నిధులు కావాలి. 20 కిలో మీటర్ల కాలువ తవ్వితే రాజాపేట, ఆలేరు, యాదగిరిగుట్ట, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), మండలాలకు సాగు నీరందుతుంది. ప్రభుత్వం గంధమల్లకు ఇప్పటికే నిధులు మంజూరు చేసింది. వాటిని విడుదల చేసి పనులను ప్రారంభించాలని మంత్రులను కోరుతా.

-బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్



ఆధునీకరణకు నోచుకోని ధర్మారెడ్డి కాలువ

ఇంకా 20 శాతం పనులు పూర్తయితేనే 'బస్వాపూర్'కు నీళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు ఉపయోగపడే బస్వాపూర్(నృసింహసాగర్) రిజర్వాయర్ పనులు ముందుకు సాగడం లేదు. 11.39 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు తొలిదశ ఇంకా 20 శాతం పూర్తి కావాల్సి ఉంది. ఇవి పూర్తయితేనే ముంపు గ్రామాలను తరలించి ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపడానికి అవకాశం ఉంటుంది. ఇందుకు నిధుల కొరత అడ్డంకిగా మారింది. ముంపు గ్రామాలకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ, భూనిర్వాసితుల కోసం ఇంకా రూ.450 కోట్లు కావాల్సి ఉంది. ఇందులో భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలం చొంగల్‌తండా, లక్ష్మీనాయకుడి తండాకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.250 కోట్లు, భూములు కోల్పోతున్న రైతులకు రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే కాళేశ్వరం జలాలతో రిజర్వాయర్‌ను నింపడానికి మార్గం సుగమం అవుతుంది.



తుది దశలో నిలిచిన బస్వాపూర్ రిజర్వాయర్ పనులు



స్లాబ్ దశలో నిలిచిపోయిన సమీకృత మార్కెట్

ఎక్కడికక్కడ నిలిచిన పనులు

గత ప్రభుత్వ హయాంలో ఆలేరులో అభివృద్ధి పనులు ప్రారంభం

- నాలుగేళ్లయినా అసంపూర్తిగానే..
- కొన్నిటికి పునాది కూడా పడని దుస్థితి
- పాలకవర్గం, అధికారుల తీరుపై విమర్శలు

ఆలేరురూరల్ : మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, జంక్షన్, కూడళ్ల సుందరీకరణ.. ఇలా పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. వెరసి తమకు ఇబ్బందులు తప్పుతాయని సంతోషించిన పట్టణ వాసులు.. పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.20 కోట్లు, 2021–22లో వివిధ గ్రాంట్లు రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మొత్తం 11 పనులు చేపట్టగా కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని నిలిచిపోగా, మూడు పనులు ప్రారంభానికే నోచుకోలేదు.

చేపట్టిన పనులు ఇలా..

- సమీకృత మార్కెట్ నిర్మాణానికి 2022 మార్చిలో సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్‌తో అగ్రిమెంట్ చేసుకుంది. స్లాబ్ వరకు పనులు పూర్తి చేశారు. నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి.
- 2023 ఏప్రిల్‌లో కోటి రూపాయల వ్యయంతో ప్రారంభించిన వైకుంఠధామం పనులు నేటికీ పూర్తి కాలేదు.
- 12వ వార్డులో కుమ్మరివాడ–ఈదమ్మ దేవాలయం–రైల్వేట్రాక్ వరకు రూ.1.90 కోట్లతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రైయిన్ (వర్షపు నీటి ప్రవాహం) పనులు నిలిచిపోయాయి.
- ఎనిమిదవ వార్డులో రూ.69 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన స్ట్రాం వాటర్ డ్రైయిన్ పనులు ప్రారంభించనే లేదు.
- బహద్దూర్‌పేటలో రూ.96 లక్షలతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రైయిన్ పనులు 12 నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి.
- డంపింగ్ యార్డు పనులు అటుకెక్కాయి.
- రూ.25 లక్షల అంచనా వ్యయంతో రెండు ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఫ్లైఓవర్ కూడళ్ల సుందరీకరణ పనులు ఇప్పటి వరకు మొదలుకాలేదు.
- మీడియన్, జంక్షన్లు, రోడ్డు డివైడర్ పనులను ప్రారంభించలేదు.



సుందరీకరణకు నోచుకోని కూడలి



కంపచెట్లతో దర్శనమిస్తున్న శ్మశానవాటిక

అన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి



మున్సిపాలిటీల్లో వివిధ రకాల సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్మశానవాటిక వాటికలో మౌలిక వసతులు లేవు. కంపచెట్లు మొలిచాయి. డంపింగ్ యార్డు లేదు. చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగా ఉన్నా పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం లేదు.

-చెరిగే శ్రీనివాస్, ఆలేరు

నిధుల్లేక ఆలస్యం



మున్సిపాలిటీ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ నిధులు, స్పెషల్ గ్రాంట్స్‌తో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని పనులు నిధులు లేకపోవడంతో ఆలస్యం జరుగుతుంది. ముఖ్యంగా డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, జంక్షన్, కూడళ్లలో సుందరీకరణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం

-లక్ష్మి, ఆలేరు మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

పోషకాహారంతో ఆరోగ్యవంతమైన జీవనం



పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బొమ్మలరామారం : పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని హైదరాబాద్ కార్యాలయ జాతీయ పోషకాహార సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్లు హారిక, శ్రీలత పేర్కొన్నారు. జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం బొమ్మలరామారం మండలం మర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పోషక విలువతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అదే విధంగా క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు ముఖీత్, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజల కోలాహలం నెలకొంది. వేకువజామున స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు అనంతరం స్వామివారిని ఆరాధిస్తూ అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

వలిగొండ : పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్‌తో అప్రమత్తంగా ఉండాలని డీఆర్డీఓ నాగిరెడ్డి సూచించారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా గురువారం వలిగొండ మండలంలోని రెడ్లరేపాక, టేకులసోమారం గ్రామాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి పరిసరాల ను శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ సురేష్, డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం జానీ, ఏపీఓ పరుశరాం, సీసీ అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



రక్తదానం చేస్తున్న యువకులు, చిత్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, నాయకులు

భువనగిరి : ప్రధానిగా మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, యువత మోదీ అడుగుజాడల్లో నడవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పేర్కొన్నారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో సేవా మహాయజ్ఞంలో భాగంగా గురువారం భువనగిరిలోని శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రధాని అయిన తరువాత భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా పఖ్వాడా జిల్లా కన్వీనర్ తుమ్మల మురళీధర్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, సేవా మహాయజ్ఞం జిల్లా కో కన్వీనర్ బట్టు క్రాంతి, కుక్కొండ లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్‌గుప్తా, అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బలరాం, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, కుమారస్వామి, రాజేందర్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

'జమిలి'తో ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

భువనగిరిటౌన్ : జమిలీ ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలుగుతుందని, దీన్ని అందరూ వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. గురువారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జెమిలీ విధానం ద్వారా ఐదేళ్లు అధికారంలో ఉండాల్సిన ప్రభుత్వాలు మధ్యలోనే కూలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. తరచూ ప్రభుత్వాలు మారడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రాజ్యాంగంలో మార్పులు చేసేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలో భాగమే జెమిలీ ఎన్నికలని విమర్శించారు. కేంద్ర నిర్ణయాన్ని రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, సిర్పంగి స్వామి, జల్లెల పెంటయ్య, ఎండీ పాషా, బందారు నరసింహ, గంగాదేవి సైదులు, బొల్లు యాదగిరి, గుండు వెంకటనర్సు, దోడ యాదిరెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి, మద్దెపురం రాజు, ఎంఎ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ పోస్టుకు ఆహ్వానం

బీబీనగర్ : మండలంలోని గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలలో హిస్టరీ సబ్జెక్ట్ బోధించడానికి గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిరూప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై, 50 శాతం మార్కులు కలిగి వుండాలన్నారు. నెట్ సెట్ అర్హత ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు డెమో ఇవ్వాల్సి ఉంటుందని, ఆ తరువాతే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 23న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

రోప్‌వే నిర్మాణంపై కేంద్రానికి నివేదిక

- రాష్ట్ర టూరిజం శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి
- ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో కలిసి భువనగిరి ఖిలా సందర్శన



రోప్‌వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు

భువనగిరి : రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, ఎల్‌ఎండ్‌టీ సంస్థ ప్రతినిధులు గురువారం భువనగిరి ఖిలాను సందర్శించారు. ఖిలాపైకి రోప్‌వే ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రోప్‌వే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. రైతులు నష్టపోకుండా రోప్‌వే అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను కేంద్రానికి పంపుతామని చెప్పారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కే.జెండగేను కలిశారు. రోప్‌వే నిర్మాణం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభి స్తామని తెలిపారు. ఖిలాను సదర్శించిన వారిలో ఎల్‌అండ్‌టీ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు పీడీఎం సుమతి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ధనుంజనేయులు ఉన్నారు.

సాధారణ కాన్పుల సంఖ్య పెంచండి



బొమ్మలరామారం పీహెచ్‌సీలో మందుల స్టాక్ రికార్డ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



ఎస్‌బీఐలో రుణమాఫీ పొందిన రైతుల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

బొమ్మలరామారం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే వైద్యాధికారులకు సూచించారు. బొమ్మరామారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, కాన్పుల వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రి పరిసరాల్లో చెట్లు పెరిగి అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించారు. పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందజేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఇంటింటి సర్వే చేపట్టి జ్వరపీడితులను గుర్తించాలని వైద్యాధికారి సుమలతను ఆదేశించారు. జ్వరపీడితులు అధికంగా ఉన్న గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. సకాలంలో విధులకు హాజరై రోగులకు సేవలందించాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎస్‌బీఐకి వెళ్లి రైతు రుణమాఫీ వివరాలు తెలుసుకున్నారు. జాబితాలో పేర్లు వచ్చిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసి కొత్త రుణాలో ఇవ్వాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, మండల వ్యవసాయాధికారి దుర్గేశ్వరి, ఆయుష్ డాక్టర్ క్రాంతి, ఏఈఓ మౌనిక రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ సురేష్ ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్లినిక్

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో త్వరలో అందుబాటులోకి..

- ప్రతి మంగళవారం ఓపీ సేవలు
- అవసరాన్ని బట్టి పనిదినాల పెంపు
- వైద్యసిబ్బంది నియామకం

భువనగిరి : స్త్రీ, పురుషులకు మాదిరిగానే ట్రాన్స్‌జెండర్లకు సమానత్వ వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మైత్రిక్లినిక్ పేరిట ఉచితంగా వైద్య సేవలు అందించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం, వార్డు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించనున్నారు. మైత్రిక్లినిక్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. తాము అనారోగ్యం పాలైతే ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నామని, ధైర్యం చేసి వెళ్లినా అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల సర్కారు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే వారికోసం ప్రత్యేక క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సేవలు

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేస్తున్న మైత్రిక్లినిక్‌లో ప్రతి మంగళవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓపీ సేవలందనున్నాయి.



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్న వార్డు

వైద్యులు వీరే..

మైత్రిక్లినిక్‌లో సేవలందించేందుకు ప్రత్యేకంగా ఐదుగురు వైద్యులను నియమించనున్నారు. ఇందులో గైనకాలజిస్ట్, చర్మ వైద్యుడు, మానసిక వైద్యుడు, జనరల్ ఫిజిషియన్, నర్సు ఉంటారు.

ఓపీ సేవలందించనున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. వైద్యులు రాసి ఇచ్చే మందులను తీసుకునేందుకు సైతం ప్రత్యేకంగా సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

అవసరాన్ని బట్టి పెరగనున్న పనిదినాలు

మైత్రిక్లినిక్‌లో ప్రస్తుతానికి ప్రతి మంగళవారం మాత్రమే సేవలందించనున్నారు. ఒకవేళ క్లినిక్‌కు వచ్చే వాళ్ల సంఖ్య పెరిగితే.. దాన్ని బట్టి పనిదినాల సంఖ్య పెంచే అవకాశం ఉంది. జిల్లాలో సుమారు 30 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అధికారికంగా 13 మంది ఉన్నట్లు గుర్తించినా ఇతర జిల్లాల నుంచి వచ్చి స్థిరపడిన వారు మరో 17 మంది ఉన్నట్లు అంచనా. గుర్తించని వారుంటే వారికి కూడా సేవలందించనున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కాగా తమ కోసం ప్రత్యేకంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మైత్రిక్లినిక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మైత్రిక్లినిక్‌ను సిద్ధం చేస్తున్నాం

ట్రాన్స్‌జెండర్లకు వైద్యసేవలు అందజేయడానికి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రత్యేకంగా క్లినిక్ ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రత్యేకంగా ఓపీ విభాగం, వార్డు ఏర్పాటుతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమిస్తాం. త్వరలోనే క్లినిక్‌ను ప్రారంభిస్తాం. ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ రాజారావు, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి మండల పరిధిలో గురువారం జరిగింది. మండలంలోని నందనం గ్రామానికి చెందిన కడమంచి శంకర్ భువనగిరి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. గ్రామంలోని కంఠమహేశ్వర ఆలయ ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి రూరల్: మద్యం తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. భువనగిరి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఇప్ప అశోక్ (41) మద్యానికి బానిసయ్యాడు. బుధవారం అశోక్ మద్యం తాగడానికి భార్యని డబ్బులు అడగగా ఆమె ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారం చేసిన నిందితుడి అరెస్ట్

నల్లగొండ క్రైం: పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వృద్ధురాలిపై అత్యాచారం చేసిన నిందితుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నల్లగొండ పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు కందుల కృష్ణ అలియాస్ కిట్టు వృద్ధురాలిపై అత్యాచారం చేయగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి

చివ్వెంల(సూర్యాపేట): వ్యవసాయ పొలానికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని స్కూటీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన మిర్యాల ప్రతాప్‌రెడ్డి(63) తన వ్యవసాయ పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రతాప్‌రెడ్డిని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు వీరారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి. వెంకట్‌రెడ్డి తెలిపారు.

సౌండ్ బాంబులు!

పండుగలు, శుభకార్యాలు, రాజకీయ నాయకలు పుట్టినరోజు, అభిమాన నటుడి సినిమా రిలీజ్.. సందర్భం ఏదైనా సరే డీజే పాటలు సర్వసాధారణంగా మారిపోయాయి. చెవుల్లో బాంబ్‌లు పేలినట్లు ఉండే ఈ డీజే పాటలు కొందరికి ఆనందం కలిగిస్తే.. మరికొంత మందికి చిరాకును కల్గిస్తున్నాయి. గుండెజబ్బులు ఉన్నావారు, చిన్న పిల్లలు, గర్భిణులు డీజే సౌండ్ వింటే హడలిపోతున్నారు. ప్రతి ఐదుగురిలో ఒకరిపై ఈ డీజే శబ్దాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్యులు అంటున్నారు.



- వేడుకలు, ఫంక్షన్లలో తప్పనిసరైన డీజే
- అధిక శబ్దాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయంటున్న వైద్య నిపుణులు

కోదాడ: సాధారణంగా ఆరోగ్యవంతమైన మానవుడు 45 నుంచి 55 డెసిబుల్స్ శబ్దాన్ని భరించగలరు. అంతకుమించి శబ్దం వింటే మానసిక ఆందోళన, అధిక రక్తపోటు, గుండెలయలో తేడా, నాడీ మండలంపై ఒత్తిడి వంటి సమస్యలు మొదలవుతాయని ఆరోగ్య నివేదికలు చెపుతున్నాయి. డీజేల వల్ల 100 నుంచి 140 డెసిబుల్స్ శబ్దం ఉత్పత్తి అవుతుంది. దీనికి సమీపంలో గంట నుంచి రెండు గంటలున్నవారు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని, ఇవి అప్పటికప్పుడు బయటపడకపోయినా తర్వాత కాలంలో తీవ్ర సమస్యగా మారుతుందని వైద్యులు అంటున్నారు.

గర్భిణులపై తీవ్ర ప్రభావం..

శబ్ద కాలుష్యం గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. గర్భధారణ తర్వాత 15 నుంచి 60 రోజుల వ్యవధిలో పిండంలో అంతర్గత అవయవాలు, కేంద్రనాడీ వ్యవస్థ ఏర్పడతాయి. ఇలాంటి సమయాల్లో గర్భిణులు 55 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని వింటే అంతర్గత అవయవాల ఏర్పాటు, కేంద్ర నాడీ వ్యవస్థలో లోపాలు తలెత్తే అవకాశం ఉంది. తల్లి ఎక్కువ శబ్ద కాలుష్యానికి గురైతే తల్లి రక్తనాళాలు సంకోచించి పిండానికి రక్తప్రసరణ తగ్గుతుంది. పిండం ఎదుగుదల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో గర్భిణులు 55 డెసిబుల్స్ కంటే అధికంగా శబ్దం ఉండే ప్రాంతాలకు వెళ్లకూడదని వైద్యులు అంటున్నారు. ప్రస్తుతం వివిధ ఊరేగింపుల్లో వాడుతున్న డీజేలు100 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని సృష్టిస్తున్నాయి. ఈ డీజే శబ్దాల వలన కొంతమంది గుండెపోటుకు గురై మృతిచెందిన సందర్భాలు కూడా ఉన్నాయి.

90 శాతం నివారించగలిగాం

డీజేల వలన కలిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఇటీవల వినాయక మండలపాల వద్ద డీజేలు వాడకుండా కఠినంగా వ్యవహరించాం. దాదాపు 90 శాతానికి పైగా డీజేలను నివారించగలిగాం. వినని వారిపై నాలుగు కేసులు కూడా నమోదు చేశాం. అనుమతులు లేకుండా రోడ్ల మీద క్రాకర్స్ కాల్చితే కేసులు నమోదు చేస్తాం. ఒకరి ఆనందం ఇతరులకు ఇబ్బందిగా మారకూడదు. ఆయా కాలనీల ప్రజలు స్వచ్ఛందంగా డీజేలను వాడవద్దు.

– ఎం. శ్రీధర్‌రెడ్డి, కోదాడ డీఎస్పీ

నిషేధం ఉన్నా..

డీజేలు, లౌడ్ స్పీకర్లపై నిషేధ ఉన్నా అమలు చేయడంలో అధికారుల విఫలమవుతున్నారు. వీటిని ఎక్కువగా పెళ్లిళ్లు, సామూహిక ఉత్సవాలలో(వినాయక చవితి, బతుకమ్మ, దసరా ఉత్సవాలు) వాడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలలో ఉన్న నాయకుల నుంచి ఒత్తిడిలు రావడంతో పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక చందాలతో నిర్వహించే కార్యక్రమాల్లో డీజేలకు, క్రాకర్స్‌కు ఎక్కువ ఖర్చుపెడుతుండడం ఆందోళన కలిగించే అంశం. ప్రతి పట్టణంలో ఏదో ఒక కార్యక్రమంలో ప్రజలు సంచరించే ప్రధాన రోడ్లపై అధిక శబ్దం వచ్చే క్రాకర్స్ కాల్చడం పరిపాటిగా మారింది. ప్రతి పట్టణంలో డీజేల నిర్వాహకులు, అనుమతులు లేకుండా క్రాకర్స్ అమ్ముతున్నవారు కేవలం నగురైదుగురు మాత్రమే ఉంటారు. వీరిని కూడా నియంత్రించలేక పోలీసులు చేతులెత్తేస్తున్నారని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లోకి చొరబడి.. కత్తులతో బెదిరించి

- ఐదున్నర తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.50వేల నగదు దోచుకెళ్లిన దొంగలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

మేళ్లచెరువు: మండలంలోని వెల్లటూరు గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఓ ఇంట్లోకి దొంగలు ప్రవేశించి ఇంట్లోని వారిని కత్తులతో బెదిరించి అందినకాడికి దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లటూరులో నివాసముంటున్న ఇటుక బట్టీల నిర్వాహకుడు తమ్మశెట్టి వెంకయ్య ఇంట్లోకి గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఐదుగురు దొంగలు ప్రవేశించారు. ముసుగు ధరించిన దొంగలు ఇంట్లోని వారిని కత్తులతో బెదిరించి బీరువాలోని రూ.50వేల నగదు, సుమారు ఐదున్నర తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, రూరల్ సీఐ రజితారెడ్డి తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

పోలీస్ స్టేషన్‌కు వాస్తు దోషమట !

- మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి అర్ధాంతరంగా బదిలీ అవుతున్న పోలీసు అధికారులు
- వాస్తు బాగోలేదంటూ ఒక గేటుకు తాళం వేసిన పోలీసులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే పోలీసు అధికారులు ఏదో ఒక కారణంతో అర్ధాంతరంగా బదిలీ అవుతున్నారు. దీంతో వాస్తు దోషం ఉందని ఈ పోలీస్ స్టేషన్ గేటుకు పోలీసులు తాళం వేశారు. కొందరు పోలీసు అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో మిర్యాలగూడ పోలీస్ స్టేషన్ పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నప్పటికీ ఏదో ఒక వివాదంతో బదిలీలు, అటాచ్‌మెంట్ పేరుతో వెళ్లిపోతున్నారు. గతంలో ప్రస్తుత వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న రూరల్ పోలీస్ స్టేషన్‌ను 2013లో పాత వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, చైర్మన్లు ఉన్న బిల్డింగ్‌లోకి మార్చారు. రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఇక్కడికి మార్చిన తర్వాత 9మంది ఎస్‌ఐలు పనిచేశారు. వీరిలో కొందరు ఎస్‌ఐలు వివిధ వివాదాల్లో బదిలీపై వెళ్లారు. రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ ఎస్‌ఐ వాస్తు బాగాలేందటూ ఉత్తరం, దక్షణం, పడమర, తూర్పు వైపు గేట్లు పెట్టించారు. కాగా ఆ గేట్లు పెట్టిన వారం రోజులకే ఓ వివాదంలో ఆ ఎస్‌ఐ బదిలీ అయ్యారు. దీంతో రెండు గేట్లు మూసివేయగా తాజాగా మరో గేటు మూసివేయడం చర్చనీయాంశంగా మారింది.

వివిధ వివాదాల్లో బదిలీపై వెళ్లిన ఎస్‌ఐలు వీరే..

- ఎం. రాహుల్‌దేవ్ 24.06.2013 నుంచి 06.11.2014 వరకు పని చేయగా.. మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ వివాదంలో బదిలీపై వెళ్లారు.
- డి. సైదాబాబు 15.03.2018 నుంచి 24.12.2019 వరకు పనిచేసి ఇసుక రవాణా వివాదంలో బదిలీపై వెళ్లారు.
- జి. సతీష్ 28.01.2024 నుంచి 04.03.2024 వరకు పనిచేసి మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామంలో ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని ఓ ప్రజాప్రతినిధి ఫోన్‌తో వదిలేయగా.. ఆలగడప గ్రామ సమీపంలో మంత్రి ఉత్తమ్ సొంత నియోజకవర్గానికి చెందిన ఇసుక ట్రాక్టర్లు పట్టుకోవడంతో బదిలీపై వెళ్లారు.
- కె. నరేష్ 14.03.2024 నుంచి 12.09-2024 వరకు పనిచేసి అవినీతి ఆరోపణలో ఎస్పీ కార్యాలయానికి అటాచ్‌మెంట్‌గా వెళ్లారు.

అదేవిధంగా ఎస్‌ఐ అవినీతి విషయాన్ని మీడియాకు లీక్ చేశారనే కారణంతో ఈ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ బండి యాదగిరిని చందంపేటకు, హెడ్‌కానిస్టేబుల్ తుల్జానాయక్‌ను చింతపల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్



పోలీస్ స్టేషన్ ఒక గేటుకు తాళం వేసిన పోలీసులు

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన



గట్టికల్‌లో డ్రోన్‌తో మందులను పిచికారీ చేస్తున్న అధికారులు

ఆత్మకూర్ (ఎస్): మారుతున్న వాతావరణం, నూతన సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ వరిలో డ్రోన్‌ను ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో మందులు పిచికారీ చేసుకోవచ్చని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్ అన్నారు. భారతీయ వరి పరిశోధన సంస్థ– హైదరాబాద్– ఎస్‌బీఐ, ఫౌండేషన్ సీఎస్ఆర్ సహకారంతో గురువారం గట్టికల్లు గ్రామంలో వరిలో యాజమాన్య పద్ధతులు, డ్రోన్‌తో మందుల పిచికారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడారు. డ్రమ్ సీడర్, వేదజల్లే పద్ధతిలో నేరుగా వరి సాగు చేయడం వల్ల కూలీల ఖర్చును ఆదా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి ప్రోగ్రాం కంప్యూటర్ ఆపరేటర్ ఎ.నరేష్, రైతులు ఎస్.లింగయ్య, కె.నాగరాజు, కె.వీర శంకర్, కె.అయోధ్య, రాములు, మహేష్, గోవర్ధన్, వ్యవసాయ విద్యార్థులు ఎ. భరత్ రెడ్డి, ఎస్. దత్త సాయి, టీ. జాన్, ఒ.రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మోత్కూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో మోత్కూరులోని సాయి చైతన్య హైస్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి జూడో పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఈ నెల 23, 24, 25 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యాదాద్రి జిల్లా సెక్రెటరీ బి. బాలకృష్ణ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ఎస్‌ఐ డి. నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ బి. రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు టి. గోపాల్‌రెడ్డి, జూడో అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ బి. బాలరాజు, కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్ అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలో సుమారు 5వేల హెక్టార్లు అన్యాక్రాంతమయ్యాయని గత నెల 31న సాక్షి దినపత్రికలో 'అటవీ భూముల ఆక్రమణ' శీర్షికన ప్రచురితమైన కథనానికి అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. మండలంలో అటవీ భూముల ఆక్రమణలను నియంత్రించడంలో నిర్లక్ష్యం వహించిన దామరచర్ల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సీహెచ్.రాములును సస్పెండ్ చేస్తూ యాదాద్రి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ శివానిదోగ్రా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని దిలావర్‌పూర్ బ్లాక్, కేజీఆర్ కాలనీలోని వందలాది ఎకరాల్లో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా, చెట్లను తొలగించి భూములు సాగు చేస్తున్నా ఉన్నతాధికారులకు సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించినందుకుగాను రాములును సస్పెండ్ చేశారు. ఇటీవల ఆక్రమణకు గురైన భూములను అటవీ సిబ్బంది పరిశీలిస్తున్న క్రమంలో కొందరు ఆక్రమణదారులు సిబ్బందిపై దాడికి పాల్పడగా ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. నివేదిక ప్రకారం.. విధుల పట్ల సెక్షన్ ఆఫీసర్ రాములు విధుల పట్ల అలసత్వం వహించడంతో అతడిని బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.



ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాములు

పురుగు మందు డబ్బాలతో రైతుల ఆందోళన

నడిగూడెం : నడిగూడెం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు గురువారం కాగితరామచంద్రాపురం కాల్వ కట్ట వద్ద పురుగు మందు డబ్బాలతో ఆందోళన చేశారు. కాల్వకు గండి పడి పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి, నీరందించాలని కోరారు. నీరందించకపోతే ఆత్మహత్యే శరణ్యమని పేర్కొన్నారు. అక్కడే ఉన్న సీఈ రమేష్ బాబు హామీతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు కంబాల వీరబాబు, అంబడి నాగేందర్, లింగారెడ్డి, పుట్టా పిచ్చయ్య, శ్రీను పాల్గొన్నారు.

కోర్టు తీర్పు వచ్చే వరకు కూల్చొద్దు

నల్లగొండ టూటౌన్: కోర్టు తీర్పును గౌరవిస్తున్నామని, తాము పైకోర్టుకు వెళ్తున్నందున తీర్పు వచ్చే వరకు నల్లగొండలోని బీఆర్ఎస్ కార్యాలయ భవనాన్ని కూల్చొద్దని నల్లగొండ జెడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోర్టు తీర్పు వచ్చే వరకు బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రభుత్వ, ప్రజా అవసరాలకు ఉపయోగించుకోవాలని కోరారు. నల్లగొండలో ఏ పార్టీ కార్యాలయానికి కూడా అనుమతులు లేవని, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై పక్షపాతం చూపించవద్దన్నారు. తాము ఎకరం స్థలం నిబంధనల ప్రకారమే తీసుకున్నామని, మంత్రి కోమటిరెడ్డి కక్షతో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూలుస్తామని పలుమార్లు చెప్పారన్నారు. సమావేశంలో నాయకులు చెరుకు సుధాకర్, నిరంజన్‌వలి, చీర పంకజ్‌యాదవ్, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, సింగం రామ్మోహన్, రవీందర్‌రావు, మారగోని గణేష్, జమాల్‌ఖాద్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండ నరేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

నల్లగొండ : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేయించేందుకు అధికారులకు తగు సూచనలు చేయాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్, తెలంగాణ రజక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్ 26న పట్టణంలోని సాగర్‌రోడ్డులో గల రజక భవన్ ఎదుట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకరాజు చెన్నయ్య, చిలుకరాజు సతీష్, పగిళ్ల సైదులు, చింతల వెంకన్న, నగేష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE : AT BHONGIR
Tr. O. P. No. 10 OF 2023

BETWEEN:
Gundla Rajaiah ...petitioner
AND
Gundla Poshetty & Others ...Respondents

NOTICE

To.
(R-4) Pandala Sakkubai W/o. Sathaiah, aged about 52 years, Occ: House-Wife, R/o. Wadaparthi Village of Bhongir Mandal, Yadadri-Bhongir District.
(R-5) Tappapla Uma W/o. Chandram, aged about 50 years, Occ: House-Wife, R/o. Wadaparthi Village of Bhongir Mandal, Yadadri-Bhongir District.
(R-7) Gadwala Somaiah, S/o. Late Narayana, aged about 52 years, Occ: Agriculture, R/o, H.No. Vinayaka nagar, Ramakrishnapuram, Secundrabad.
(R-8) Ramaram Balnarsimha, S/o. Late Narsimha, aged about 50 years, Occ: Business, R/o. H.No.1-67/A, Rampally Dayara Villages, Keesara Mandal, Medchal Malkajgiri District.
(R-9) R. Thirupathaiah, S/o. Late Sri Narahari, aged 79 years, Occ: Retd. Employee, R/o. Flat No.501, Jyothi Paradise, Brindavan Colony, Kapra Municipal, Medchal Malkajgiri District.
(R-10) R.Swarajya Lakshmi, W/o, Thirupathaiah, aged 50 years, Occ: Housewife,. R/O. Flat No.501, Jyothi Paradise, Brindavan Colony, Kapra Municipal, Medchal Malkajgiri District.
(R-11) Ramidi Srinivas Reddy, S/o. Late Buchi Reddy, aged 51 years, Occ: Agriculture, R/o. H.No.4-12, Keesara Village & Mandal, Medchal Malkajgiri District.
(R-12) R.P. Baheti, S/6. Late Punamchand Baheti, aged 80 years, Occ: Business, R/o.. H. No.30-265/20/D-1, Officer's Colony, Hyderabad - 500062.
(R-13) Yenigalla Jagan Mohan Rao, S/o. Venkata Subbaiah, aged 89 years, Occ: Business, R/o. Plot No. 117, Flat No.3, Navniram Nagar, Jubilee Hills, Road No.7, Hyderabad - 96.
(R-14) Yenigalla Siviram Prasad, S/o. Jagan Mohan Rao, aged 63 years, Occ: Retd. Employee, R/o. Plot No.117, Flat No.3, Navniram Nagar, Jubilee Hills, Road No.7, Hyderabad-96

Please take notice that the above named Petitioner Filed the Transfer OP for Memorandum of Transfer Petition Filed to Transfer the suit In O.S. No. 108 of 2017 on the File of Hon'ble Addl. Junior Civil Judge, At Bhongir to O.S.No. 32 of 2016 on the file of the Hon'ble Prl. Junior Civil Judge at Bhongir and the above said case is posted to **25-09-2024** for your appearance. In spite of this notice if you the above named **Respondents No. 4,5 and 7 to 14** fails to appear before the above said court on **25-09-2024** at **10:30 AM** either in person are through an advocate in case of your absence on the said date and time before the said court, the matter will be decided as set ex-parte.

(By order of the Hon'ble court)
Sd/- **P. Linga Reddy**, Advocate, Bhongir
Cell: 9848026024

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి యువకుడిని ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ ఆవాసం వస్రాంతండా వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం సీతారాంనగర్‌కు చెందిన పుల్లూరి హుస్సేన్(28) తండాలో నిర్మిస్తున్న సరిత ప్యాలెస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం పాల కోసం విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హుస్సేన్ తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి. వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నీటి సంపులో పడి యువతి మృతి

నల్లగొండ క్రైం: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి యువతి మృతిచెందింది. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పానగల్లుకు చెందిన అల్లి స్వప్న(18)కు మూర్ఛ వ్యాధి ఉంది. స్వప్న ఇంటర్ వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటోంది. గురువారం ఆమె తల్లి రమణ కూలీ పనికి వెళ్లగా.. స్వప్న బట్టలు ఉతికేందుకు ఇంట్లోని సంపులో నీళ్లు చేదుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. తల్లి ఇంటికి వచ్చి చూసేసరికి స్వప్న సంపులో మృతిచెంది కనిపించింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ మండలం తాటికోల్ గ్రామ శివారులోని వాగు నుంచి చింతబావి గ్రామానికి చెందిన నోముల సైదులు ట్రాక్టర్‌లో ఇసుకను తీసుకొస్తుండగా.. డిండి మండలంలోని చెర్కుపల్లి గ్రామ స్టేజీ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం జటావత్‌తండాకు చెందిన జటావత్ కాంతి(61) బుధవారం తన పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన జటావత్ నవీన్ బైక్‌పై జప్తీవీరప్పగూడెం నుంచి జటావత్‌తండాకు అతివేగంగా వెళ్తూ ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కాంతికి తీవ్రమైన గాయాలు కావడంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందింది. గురువారం మృతురాలి కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జానకిరాములు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కీటకాలు.. పంటలకు హితకారులు

పెద్దవూర: సాలీళ్లు, మిడతలు, తూనీగలను రైతు మిత్రులు, పంట రక్షిణులు, పంట కాపరులు అని అన్నదాతలు పిలుచుకుంటుంటారు. రసాయన ఎరువులను అధికంగా వాడడం వలన పంటలకు మేలు చేసే కీటకాలు చూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ అంటున్నారు. పంటలకు హితకారులైన కీటకాల గురించి ఆయన మాటల్లోనే..



సాలీడు తూనీగ మిడత

శత్రు గుడ్లను కబళించే అక్షంతల పురుగులు

నెమ్మదిగా సంచరించే పురుగులను ఇవి వేలాదిగా తింటాయి. బయటకు కనిపించే వివిధ జాతి శత్రు పురుగుల గుడ్లను కబళిస్తాయి. ఇవి చురుగ్గా కదులుతూ పిల్ల గొంగళి పురుగులు, పచ్చదోమ పిల్ల పురుగులు, కన్పించే గుడ్లను భక్షిస్తాయి. ఇది పచ్చదోమ, సుడిదోమ పిల్లలను ప్రీతిగా తింటుంది. వీటి పిల్ల పురుగులూ అతి తిండిపోతులుగా చెప్పవచ్చు.

కీటకాలు, దోమల శత్రువులు తూనీగలు..

పెద్ద, చిన్న తూనీగలు రంగురంగుల ఉలిపిరి రెక్కలతో మొక్కల పైభాగమునకు దిగువగా ఎగురుతూ ఎగిరే కీటకాలు, దోమ పిల్లల కోసం వెదుకుతూ ఉంటాయి. వీటి పిల్ల పురుగులు నీటిలో ఆవాసం ఉంటాయి. వరి కాండంపై సులభంగా సంచరిస్తూ పిల్ల దోమలను వేటాడుతాయి.

పాడి–పంట

శత్రు పురుగుల్ని తినే సాలీళ్లు..

వరిని ఆశించి నష్టపరిచే పురుగులను వివిధ రకాల సాలీళ్లు తింటూ ఉంటాయి. దీపపు పురుగులు, ఆకులను తినే గొంగళి పురుగులు, కాండం తొలుచు పురుగు, పెద్ద రెక్కల సీతాకోక చిలుకలను, ఉల్లికోడు, వరి ఈగలను, రెల్లరాల్చు పురుగు, సుడి దోమలను ఎంతో సులువుగా, మక్కువగానూ భక్షిస్తాయి. లభ్యమయ్యే శత్రు కీటక పరిమాణమును అనుసరించి ఒక్కో సాలె పురుగు 5–15 వరకూ శత్రు కీటకాలను ఒక రోజులో తినగలదు.

రాత్రిళ్లు వేటాడే మిడత..

ఎదిగిన పైరులో రాత్రివేళ చురుగ్గా సంచరించి కాండం తొలిచే పురుగు గుడ్లు, వరి నల్లనల్లి గుడ్లు, పచ్చదోమ, సుడిదోమ పిల్లల్ని కబళిస్తుంది. యవ్వన మిడతలు అమితమైన చురుకుదనంతో అలికిడి విన్నంతనే వెంటనే ఎగిరిపోతాయి. ఒక్కో భక్షక మిడత రోజుకు 3, 4 కాండం తొలుచే పురుగుల గుడ్ల సముదాయాల్ని భక్షించగలదు.

తోడేలు సాలీడు..

వరి పిలకల దశలో ఈ జాతి సాలీళ్లు ఎక్కువగా మొదళ్ల మధ్య సంచరిస్తాయి. మాగాణి భూములు, మెట్ట వరి పొలాల్లో శత్రు పురుగులపై దాడి చేసి నష్టపరిచే స్థాయికి ఎదగకుండా చేస్తాయి.

శివంగి సాలీడు

కొత్త తరం పెంపొందకుండా శత్రు పురుగులను నివారించటంలో ప్రధాన భూమికను పోషిస్తుంది.

ముసుగు యుద్ధం చేసే దుమికే సాలీడు..

చుట్టుకుపోయిన ఆకులోనే చిన్నపాటి గూడును ఏర్పరచుకుని మరో ఆకును కూడా అల్లుకుని దాక్కుని, దీపపు పురుగుల కోసం నిరీక్షిస్తుంది. అదును దొరికాక సంహరిస్తుంది. ఇతర పిల్ల పురుగులను కూడా ఇవి కబళిస్తాయి.